I

సాక్షి
అనంతపురం

శనివారం ¦ 20 ¦ సెప్టెంబర్ ¦ 2025





ప్రైవేటుపై ప్రజాగ్రహం

మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే ఊరుకోం



చంద్రబాబు సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు, విద్యార్థినులు



'చలో మెడికల్ కాలేజ్'ను పురస్కరించుకుని కిటకిటలాడుతున్న పెనుకొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిసరాలు

- సర్కారును హెచ్చరించిన వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజలు
- మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడంపై మండిపాటు
- 'చలో మెడికల్ కాలేజీ' పేరుతో పెనుకొండలో ఆందోళన
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, విద్యార్థులు
- స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలిపిన ప్రజలు
- నిర్ణయం మార్చుకునే వరకూ ఉద్యమాలు కొనసాగిస్తామని వెల్లడి

సాక్షి, పుట్టపర్తి

చంద్రబాబు 'ప్రైవేటు' నిర్ణయంపై ప్రజాగ్రహం పెల్లుబుకింది. రూ.కోట్ల విలువైన మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో పరాధీనం చేసే సర్కార్ కుట్రపై జనాగ్రహం మిన్నంటింది. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ తలపెట్టిన 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమం విజయవంతమైంది. పెనుకొండ మెడికల్ కళాశాల వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, ప్రజలు, కార్యకర్తలు, నాయకులు వేలాదిగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మండిపడ్డారు. ''సీఎం డౌన్ డౌన్.. పాలన చేతగాకపోతే దిగిపోవాలి'' అంటూ నినాదాలు చేశారు.

నిప్పులు చెరిగిన నాయకులు..

63 ఎకరాల విస్తీర్ణంలో రూ.470 కోట్లతో నిర్మాణం కావాల్సిన పెనుకొండ మెడికల్ కళాశాలను పెత్తందార్లకు కట్టబెట్టేందుకు చంద్రబాబు నిర్ణయించడం దుర్మార్గమని పలువురు నాయకులు మండిపడ్డారు. మెడికల్ కళాశాల భవనాల వద్ద వారు మాట్లాడారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం, పేద కుటుంబాల్లోని పిల్లలకు వైద్యవిద్యను దూరం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. పెనుకొండ నుంచే ఓ మంత్రి, ధర్మవరం నుంచి ఆరోగ్య శాఖ మంత్రి ఉన్నప్పటికీ మెడికల్ కాలేజీల గురించి నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. పెనుకొండలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను ఆపినా ఇద్దరు మంత్రుల్లో ఎలాంటి చలనమూ లేదన్నారు. 'నేను లోకల్' అని చెప్పుకొని తిరిగే మంత్రి సవిత పెనుకొండ నుంచి ప్రాతినిథ్యం వహిస్తోందనే విషయం మరిచారా అంటూ ఎద్దేవా చేశారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్.. కనీసం ఓసారైనా మెడికల్ కాలేజీ పరిశీలించారా అంటూ ప్రశ్నించారు. మెడికల్ కాలేజీ నిర్మాణ బాధ్యతలు, నిర్వహణను ప్రభుత్వమే చూడాలని నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటిస్తే.. నేడు ప్రైవేటీకరణ చేసే హక్కు ఎవరు ఇచ్చారు చంద్రబాబూ అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య, శింగనమల మాజీ సమన్వయకర్త వీరాంజనేయులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీమ్ అహ్మద్, పార్టీ నేతలు వెన్నపూస రవీంద్రా రెడ్డి, తాడిపత్రి ఫయాజ్ బాషా, విద్యార్థి విభాగం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రాయల్, మాజీ మంత్రి నర్సేగౌడ, యువజన విభాగం పెనుకొండ అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రెడ్డి, పుట్టపర్తి యువజన విభాగం అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా అగ్రీ బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణా రెడ్డి, పుట్టపర్తి యువనేత సత్యనారాయణచౌదరి, విద్యార్థి విభాగం నాయకులు ఎం.నరేంద్రరెడ్డి, వేముల అమర్‌నాథ్‌రెడ్డి, పెనుకొండ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ, పెనుకొండ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండ మెడికల్ కళాశాల వద్ద ధర్నాలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల అధ్యక్షులు అనంత, ఉష శ్రీ చరణ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, సమన్వయకర్తలు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, తలారి రంగయ్య, విశ్వేశ్వర రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు


బాబుకు పేదల సంక్షేమం పట్టదు



సీఎం చంద్రబాబుకు పేదల సంక్షేమం పట్టదు. తన అనుయాయులు బాగుపడితే చాలనుకుంటారు. అందుకే ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకే మొగ్గుచూపుతారు. ఈ క్రమంలోనే మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమయ్యారు. దీన్ని కప్పిపుచ్చేందుకు మంత్రి సవిత మెడికల్ కాలేజీ నిర్మాణ పనులే ప్రారంభం కాలేదని వ్యాఖ్యానించారు. ఇంతటి పెద్ద భవనాలు ఆమె కళ్లకు కనిపించలేదా..? కళ్లు లేని కబోదిలా ఓ మంత్రి మాట్లాడటం సిగ్గుచేటు. ఎంతో మంది విద్యార్థులు తక్కువ ఫీజుతోనే వైద్య విద్యను పూర్తి చేయాలనే ఉద్దేశంతో నాడు సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు రూ.8 వేల కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన చంద్రబాబు పరాధీనం చేసేందుకు సిద్ధపడటం దుర్మార్గం. వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకోవాలి. లేకపోతే వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తాం.

– జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

పెత్తందార్ల కోసమే



ప్రభుత్వం నిర్వహించాల్సిన మెడికల్ కాలేజీలను తన చుట్టూ ఉండే పెత్తందార్లకు అప్పగించడం కోసమే చంద్రబాబు ప్రైవేటీకరణ మార్గం ఎంచుకుంటున్నారు. ప్రజలు ఏమైనా.. రాష్ట్రం ఏ గతిలో ఉన్నా... చంద్రబాబుకు అవసరం లేదు. తన వాళ్లు బాగుంటే చాలనుకుంటారు. గతంలో మూడుసార్లు సీఎంగా ఉన్నా.. ఏనాడూ మెడికల్ కాలేజీల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకేసారి 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుడితే.. నాల్గోసారి సీఎం అయిన చంద్రబాబు... ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తామని ప్రకటించడం దుర్మార్గం. – అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

బాబు ఏనాడూ మంచి చేయలేదు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల నుంచే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. రాజకీయాల్లో సుదీర్ఘ కాలంగా ఉన్నప్పటికీ చంద్రబాబు ఏనాడు ప్రజలకు మంచి చేసింది లేదు. ప్రజా సంక్షేమం కాంక్షించే నేతల వరుసలో చంద్రబాబుది ఎప్పుడూ చివరే. నాటి నుంచి పేద ప్రజల బాగు కోసం పథకాలు తీసుకువచ్చి జనరంజక పాలన చేసింది వైఎస్ కుటుంబమే. చంద్రబాబు కేవలం తన బినామీ సంస్థలు బాగుపడాలనే ఉద్దేశంతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

– విశ్వేశ్వరరెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే

సరైన నిర్ణయం కాదు



ఏ రాష్ట్రంలో అయినా ప్రజలకు ఉపయోగపడే పథకాలు అమలు చేయాలి. పాలన కూడా అలాగే ఉండాలి. అయితే ఏపీలో చంద్రబాబు పాలన ప్రజల ఆలోచనలకు విరుద్ధంగా ఉంటోంది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సరైన నిర్ణయం కాదు. మరోమారు ఆలోచించి నిర్ణయం మార్చుకుంటే మంచిది.

– మహాలక్ష్మి శ్రీనివాస్, అహుడా మాజీ చైర్మన్

హాఫ్ నాలెడ్జ్ మంత్రి సవిత



పెనుకొండలో నేను లోకల్ అని చెప్పుకొనే మంత్రి సవితకు స్థానికంగా ఉండే మెడికల్ కాలేజీ భవనాలు కనిపించవా? ఇక్కడ ఇంత పెద్ద భవనాలు నిర్మితమై ఉంటే ఎలాంటి భవనాలు లేవంటూ రాళ్లు, గుట్టలు చూపిస్తూ తాను.. హాఫ్ నాలెడ్జ్ మంత్రి అని మరోసారి నిరూపించుకున్నారు. ఇక్కడున్న రెండంతస్తుల భవనం ఎక్కి దూకితే ఆమె కాళ్లు విరగకుంటే నిర్మాణాలు లేనట్లే! లేనిపక్షంలో మంత్రి బహిరంగ క్షమాపణలు చెప్పాలి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసే ఆలోచనను విరమించుకోకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తాం.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు

ఏ రాష్ట్రంలోనూ లేదు



దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఒకేసారి 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టిన దాఖలాలు లేవు. కానీ జగనన్న ఆ ఘనత సాధించారు. నేడు రూ.కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను నారాయణ, చైతన్య వంటి ప్రైవేటు యాజమాన్యాలకు కట్టబెట్టేందుకే చంద్రబాబు ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకున్నారు. అసోంలో 12, కర్ణాటకలో 21, కేరళలో 11, తమిళనాడులో 32, యూపీలో 40 ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్నాయి. రూపాయికే వైద్యం చేసిన వైఎస్సార్ లాంటి డాక్టర్లు రావాలంటే మెడికల్ కాలేజీలు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఉండాలి. పేదలకు వైద్యవిద్య అందించడం ఇష్టం లేకనే చంద్రబాబు ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయం తీసుకున్నారు.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

కళ్లు లేని వారిలా మాట్లాడకండి



పెనుకొండలో ఇంత పెద్ద మెడికల్ కాలేజీ నిర్మాణం కళ్లముందు కనబడుతుంటే.. నిర్మాణాలే ప్రారంభించలేదని మంత్రి సవిత వ్యాఖ్యానించడం హాస్యాస్పదం. కళ్లు లేని కబోదుల్లా కూటమి పాలకులు మాట్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కూడా కాకముందే ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత మొదలైంది. ఆయా పార్టీల నేతలు ప్రజల్లోకి వెళ్లలేని స్థితిలో ఉన్నారు.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

విద్యార్థులంతా ఉద్యమిస్తాం



మెడికల్ కళాశాలలు కడితే సీట్లు పెరిగి నిరుపేద కుటుంబాల్లోని వారు డాక్టర్లయ్యే అవకాశం ఉంటుంది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలోనే కనీవినీ ఎరుగని రీతిలో 17 మెడికల్ కాలేజీలకు ఒకేసారి శ్రీకారం చుట్టారు. ఎంతో మంది పేద విద్యార్థులు, ప్రజలకు ఉపయోగపడే ఈ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తామంటే ఊరుకునేది లేదు.

– చంద్రశేఖర్‌యాదవ్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

చంద్రబాబు నైజమే అంత



ప్రజా వ్యతిరేక పాలన అందించడం చంద్రబాబు నైజం. అలవిగాని హామీలతో గద్దెనెక్కడం, ప్రజలను వంచించడం ఆయనకు పరిపాటిగా మారింది. నాలుగుసార్లు సీఎం అయినా.. ప్రజలకు ఏం కావాలో తెలుసుకోలేని మనస్తత్వం బాబుది. ప్రజల నాడి పట్టగలిగేది వైఎస్ కుటుంబం మాత్రమే. సీఎంగా వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయి.

– రమేశ్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు

ప్రైవేటీకరణ వద్దు



ఆ నాడు వైఎస్ జగన్ నిరుపేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడంతో పాటు పేద కుటుంబాల్లోని పిల్లలూ వైద్యవిద్యనభ్యసించేలా మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారు. అయితే నేడు వాటన్నింటినీ ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం బాధాకరం. వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

– సాకే చంద్రశేఖర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

న్యూస్‌రీల్

వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల ఐదు రోజులు ఉమ్మడి జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న 9.7 మి.మీ, 21న 5.2 మి.మీ, 22న 13 మి.మీ, 23న 12.2 మి.మీ, 24న 5.5 మి.మీ సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు.

పొలం పనులు వదులుకుని పడిగాపులు



బ్రహ్మసముద్రం సచివాలయం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద శుక్రవారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. పొలం పనులు వదులు కొని ఉదయమే సచివాలయానికి క్యూకట్టారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి రైతులకు యూరియా అందించేందుకు సాయంత్రమైంది. ఈ క్రమంలో క్యూలో రైతుల నడుమ తోపులాట జరగడంతో పోలీసులు రంగంలోకి దిగి అదుపు చేయాల్సి వచ్చింది.కాగా, బ్రహ్మసముద్రం మండలంలో 14 రైతు సేవా కేంద్రాలు ఉండగా, అందులో 4 రైతు సేవా కేంద్రాలకు మాత్రమే యూరియా సరఫరా చేశారు. అది కూడా ఒక్కో కేంద్రానికి 280 బస్తాల చొప్పున స్టాక్ ఇచ్చినట్లు తెలిసింది.

డెంగీతో విద్యార్థిని మృతి



ఉత్ప్రేక్ష (ఫైల్)

వజ్రకరూరు: డెంగీతో విద్యార్థిని మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. కొనకొండ్ల గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి, నరసింహులు దంపతులకు ముగ్గురు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె ఉత్ప్రేక్ష (09) గ్రామంలోని కోట ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతోంది. ఈ నెల 12న ఉత్ప్రేక్ష జ్వరం బారిన పడింది. తల్లిదండ్రులు మొదట కొనకొండ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో, తర్వాత గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించినా జ్వరం తగ్గలేదు. ఈ క్రమంలో అనంతపురంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా డెంగీ సోకినట్లు డాక్టర్లు నిర్ధారించి ఆ మేరకు చికిత్సలు ప్రారంభించారు. అయితే, చికిత్స ఫలించక గురువారం సాయంత్రం ఉత్ప్రేక్ష మరణించింది. శుక్రవారం కొనకొండ్లలోని కోట పాఠశాలలో విద్యార్థిని ఉత్ప్రేక్ష మృతికి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ధనుంజయ, రామాంజినేయులు, జాకీర్, హునారాబేగమ్ తదితరులు సంతాపం తెలిపారు.

పనితీరులో తేడాలొస్తే ఉపేక్షించను

- కలెక్టర్ ఆనంద్



అనంతపురం అర్బన్: పనితీరులో తేడాలొస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తయ్యాక బిల్లులు నెలదాటి పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్ కింద పెండింగ్‌లో ఉన్న 354 పనులు చేపట్టాలన్నారు. సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష కింద కేజీబీవీల్లో చేపడుతున్న డార్మెంట్రీ పనులు పూర్తవ్వాలన్నారు. జిల్లాలో పీఎంశ్రీ కింద ఉన్న 42 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ తయారుచేయాలన్నారు. హౌసింగ్ కింద కేటాయించిన లక్ష్యం అక్టోబరు 2 నాటికి పూర్తవ్వాలన్నారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ పాఠశాలల్లో ఖాళీల వివరాలను అందించాలని ఆదేశించారు. వసతి గృహాల్లోని విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. తండాల్లో ఎస్టీల అర్హత మేరకు ఆధార్, రేషన్ తదితర కార్డులు పొంది ఉన్నారా లేదా అని సర్వే చేయాలని సూచించారు. సైనిక సంక్షేమ శాఖ భవనానికి స్థలం, మాజీ సైనికులకు పోస్టింగ్‌ల పెండింగ్‌పై త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నన్నే పక్కన నిల్చోమంటావా!

- ప్రిన్సిపాల్‌పై చేయిచేసుకున్న విద్యార్థి
- శెట్టూరు మోడల్ స్కూల్‌లో ఘటన

శెట్టూరు: సమాజంలో గురువుకు ప్రత్యేక స్థానం ఉంది.గురువును మించిన దైవం లేదని భావించే దేశం మనది. అలాంటి గురువుకు తన శిష్యుడి నుంచి తీవ్ర అవమానం జరిగింది. ప్రిన్సిపాల్‌పై విద్యార్థి దురుసుగా ప్రవర్తిస్తూ చేయి చేసుకున్నాడు. ఈ సంఘటన శెట్టూరు మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్లో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తెలిపిన వివరాల మేరకు.. పాఠశాలలో ఉదయం ప్రార్థన సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ సమయంలో ప్రిన్సిపాల్ శ్రీరాములు యూనిఫాం, షూ ధరించని విద్యార్థులను పక్కన నిల్చోవాలని సూచించారు. అయితే షూ ధరించని ఓ పదో తరగతి విద్యార్థి 'నాకే చెప్తావా' అంటూ వింత శబ్దంతో ప్రిన్సిపాల్‌ను హేళన చేశాడు. ఈ క్రమంలోనే సదరు విద్యార్థిపై ప్రిన్సిపాల్ చేయి చేసుకోగా.. ఆగ్రహించిన విద్యార్థి ప్రిన్సిపాల్ గొంతు పట్టుకుని దాడికి దిగాడు. దీంతో ప్రిన్సిపాల్ చొక్కా చిరిగిపోయింది. ఉపాధ్యాయులు జోక్యం చేసుకుని గొడవను అడ్డుకున్నారు. తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల ముందు అవమానం జరగడంతో ప్రిన్సిపాల్ కన్నీటి పర్యంత మయ్యారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు, డీఎస్పీ రవిబాబు, ఎంఈఓ శ్రీధర్ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. సదరు విద్యార్థి ప్రవర్తన ముందు నుంచీ దురుసుగానే ఉందని, గతంలో ఒక టీచర్‌ను బెదిరించాడని, గణితం టీచర్ పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు తమ విచారణలో తేలిందని డిప్యూటీ డీఈఓ మీడియాకు తెలిపారు. పాఠశాలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు విద్యార్థిపై పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టడంతో పాటు టీసీ ఇచ్చి పంపనున్నట్లు వెల్లడించారు.



శెట్టూరులోని ఏపీ మోడల్ పాఠశాలలో విచారణ చేస్తున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు

ఇదే తరహాలో మరికొందరు విద్యార్థులు

ఏపీ మోడల్ పాఠశాలలో చరణ్‌తో పాటు మరికొందరు విద్యార్థులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. కొందరు విద్యార్థులకు తాగుడు, గుట్కా అలవాట్లు ఉన్నట్లు, ఉపాధ్యాయులతో పాటు తోటి విద్యార్థినులతో దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు డిప్యూటీ డీఈఓ తెలిపారు.

నా కుమారుడి తప్పేమీ లేదు..

నా కుమారుడి తప్పేమీ లేదు. నా కుమారుడితో ప్రిన్సిపాల్ శ్రీరాములు దురుసుగా ప్రవర్తించారు. ప్రిన్సిపాల్ చేయి చేసుకోవడం వల్లే మావాడు వాదించాడు.

– సునీతమ్మ, విద్యార్థి తల్లి

కూలిన బతుకులు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

రాప్తాడురూరల్: వారిద్దరూ టైల్స్ పని చేసే దినసరి కూలీలు. రోజులాగానే ఉదయం నుంచి సాయంత్రం దాకా పని చేసి బైకులో ఇంటికి బయలుదేరారు. మరో పది నిముషాల్లో ఇంటికి చేరుకుంటారనే లోపే మృత్యువు కబళించింది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలైన ఘటన శుక్రవారం రాత్రి అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగరానికి చెందిన ముత్తాం బాషా (32), కుమార్ (23) టైల్స్ కార్మికులుగా పని చేస్తున్నారు. వీరిలో ముత్తాం బాషాకు వివాహమైంది. ఇద్దరు పిల్లలు సంతానం. గార్లదిన్నె సమీపంలో ఓ భవనంలో టైల్స్ పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం పనికి వెళ్లిన ఇద్దరూ సాయంత్రం ముగించుకుని ఇంటికి బయలుదేరారు. పాములాయి దాటిన తర్వాత సోములదొడ్డి సమీపంలో వెనుక నుంచి లారీ ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి బైకును ఢీకొంది. ఈ క్రమంలో కింద పడిన ఇద్దరిపై లారీ చక్రాలు వెళ్లడంతో తీవ్రగాయాలై ఘటనా స్థలిలోనే దుర్మరణం చెందారు. లారీని రోడ్డుపైనే నిలిపేసి డ్రైవరు పరారవడంతో ట్రాఫిక్ స్తంభించింది. రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శేఖర్, ఎస్ఐ రాంబాబు సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ఘటనా స్థలంలో మృతదేహాలు

గుంతలే కొంప ముంచాయి!

జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలే ఇద్దరు ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యాయని స్థానికులు మండిపడుతున్నారు. జాతీయ రహదారి నిర్వహణను పట్టించుకోకపోవడంతో గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారాయన్నారు. స్పీడుగా వస్తున్న వాహనాలు గుంతలు తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

నకిలీ నోట్ల తయారీ కేసులో నిందితుల అరెస్ట్



నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించిన ప్రింటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: నకిలీ నోట్ల తయారీ, చలామణితో పాటు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్పీ జగదీష్ శుక్రవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో విలేకరులకు వెల్లడించారు. కంబదూరులోని పాత ఎస్సీ కాలనీకి చెందిన ఎం.జశ్వంత్ అలియాస్ జస్వంత్ ఉరఫ్ రాజు అలియాస్ గుండు, ఆర్డీటీ కాలనీ చెక్‌పోస్టు వద్ద నివాసముంటున్న భోగంరాజు అలియాస్ షాలేము రాజు ఉరఫ్ షాలెమ్ మంచి స్నేహితులు. క్రికెట్ బెట్టింగ్, పేకాట, తదితర వ్యసనాలకు బానిసలుగా మారి అప్పుల పాలయ్యారు. ఈ క్రమంలో సులువుగా డబ్బు సంపాదించేందుకు చైన్ స్నాచింగ్‌లు, నకిలీ నోట్ల తయారీ, చలామణి తెరలేపారు. అనంతపురం, పుట్లూరు, నార్పల, ఉరవకొండ, తాడిపత్రి చుట్టుపక్కల గ్రామాలు, వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండలంలోని పలు గ్రామాల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. గత రెండేళ్లలోనే 12 చైన్‌స్నాచింగ్‌లకు సంబంధించి వీరిపై కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఓ కలర్ ప్రింటర్‌ను సమకూర్చుకుని నకిలీ నోట్లు తయారు చేసి చలామణి చేయడం మొదలు పెట్టారు. నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసి, రూ.35 లక్షల విలువ చేసే 304 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.35,500 నగదు, నకిలీ 500 రూపాయల నోట్లు, ప్రింటర్, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

పెద్దాస్పత్రిలో భద్రత ఏదీ?

- చెలరేగిపోతున్న పోకిరీలు
- ట్రైనీ నర్సులు, హౌస్ సర్జన్లే లక్ష్యంగా వేధింపులు
- ఇటీవల జులాయి వేధింపులతో ఇంటి దారి పట్టిన హౌస్ సర్జన్
- అధికారుల ఫిర్యాదుతో నిందితుడి అరెస్ట్

ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న అనంతపురం సర్వజనాస్పత్రిలో భద్రత డొల్లేనా అని ప్రశ్నించుకుంటే అవుననే సమాధానమే కనిపిస్తోంది. కొన్ని రోజులుగా పోకిరీలు ఆస్పత్రిలో చొరబడి డ్యూటీలో ఉన్న ట్రైనీ నర్సులు, హౌస్ సర్జన్లను వేధింపులకు గురి చేయడమే ఇందుకు నిదర్శనం. బాధితులు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నా.. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉన్నతాధికారుల బాధ్యతారాహిత్యం, భద్రతా వైఫల్యం కారణంగా హౌస్ సర్జన్లు, ట్రైనీ నర్సులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 'నిన్ను ప్రేమిస్తున్నా'..నన్ను ప్రేమిస్తావా' అంటూ వెంటపడి వేధించే జులాయిల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. దీంతో సర్వజనాస్పత్రిలో విధులకు హాజరు కావాలంటేనే హౌస్‌సర్జన్లు, ట్రైనీ నర్సులు హడలెత్తిపోతున్నారు. ఇటీవల విధుల్లో ఉన్న ఓ హౌస్ సర్జన్‌ను ఓ జులాయి వేధింపులకు గురి చేయడం సంచలనం రేకెత్తిస్తోంది.

రాష్ట్రంలోనే ఏఎంసీకి ప్రత్యేక గుర్తింపు

వైద్య విద్యను అందించడంలో రాష్ట్రంలోనే అనంతపురం మెడికల్ కళాశాల (ఏఎంసీ)కు ప్రత్యేక గుర్తింపు ఉంది. దీంతో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఎందరో విద్యార్థులు ఇక్కడ వైద్య విద్యను అభ్యసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలోనే యూజీ, పీజీ సీట్లనూ అధికారులు పెంచారు. అయితే నిర్వహణ లోపాలతో అప్రతిష్ట మూటగట్టుకోవాల్సి వస్తోంది. వైద్య విద్య అభ్యసించేందుకు వచ్చిన విద్యార్థినులకు సరైన భద్రత కల్పించకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

అసభ్య ప్రవర్తనతో బెంబేలు

ఏఎంసీలో వైద్య విద్యను అభ్యసిస్తున్న పలువురు విద్యార్థినులు తరచూ జీజీహెచ్ (ప్రభుత్వ సర్వజనాస్పత్రి)కు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే జీజీహెచ్‌లో సరైన భద్రతా వ్యవస్థ లేదు. ఎవరు వస్తున్నారో.. ఎవరు పోతున్నారో పరిశీలించే పటిష్టమైన సెక్యూరిటీ సిబ్బంది లేరు. సీసీ కెమెరాల నిఘా అంతంత మాత్రమే. ఇదే ట్రైనీ నర్సులు, హౌస్‌సర్జన్ల పాలిట శాపంగా మారింది. తరచూ వారి వెంట పోకిరీలు పడుతున్నారు. ఇటీవల పిచ్చి పరాకాష్టకు చేరుకున్న ఓ జులాయి వారం రోజులుగా ఓ హౌస్ సర్జన్ వెంటపడి వేధింపులకు గురి చేస్తూ చివరకు అందరూ చూస్తుండగానే జీజీహెచ్‌లో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమైనట్లు తెలిసింది. ఈ నెల 13న తన పట్ల ఓ అపరిచిత యువకుడు అనుచితంగా ప్రవర్తించాడని జీజీహెచ్ యాజమాన్యం దృష్టికి బాధిత హౌస్ సర్జన్ తీసుకెళ్లినట్లు సమాచారం.



అయితే సకాలంలో యాజమాన్యం స్పందించకపోవడంతో జులాయి ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. అప్పటి నుంచి రోజూ హౌస్ సర్జన్ వెంటపడి వేధింపులకు గురి చేస్తూ వచ్చేవాడు. ఈ నెల 15న మరోసారి ఎఫ్ఎం వార్డు వద్ద హౌస్ సర్జన్‌ను అడ్డుకుని తనను ప్రేమించాలని ఒత్తిడి చేస్తూ అసభ్యంగా ప్రవర్తించడంతో బెంబేలెత్తిన ఆమె గట్టిగా కేకలు వేసింది. దీంతో యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ విషయాన్ని అక్కడ డ్యూటీలో ఉన్న హెడ్‌నర్సు ద్వారా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత దృష్టికి బాధితురాలు తీసుకెళ్లింది. కాగా, వేధింపులు మొదలైన తొలి రోజే అధికారులు స్పందించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని తెలుస్తోంది.

జులాయి అరెస్ట్

హౌస్ సర్జన్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై జీజీహెచ్ సూపరింటెండెంట్ చేసిన ఫిర్యాదు మేరకు అనంతపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో హౌస్ సర్జన్‌ను వేధించిన యువకుడిని అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్‌కు చెందిన మోహన్‌సాయిగా గుర్తించి, శుక్రవారం అరెస్ట్ చేశారు. కాగా, వేధింపులతో భయాందోళనకు గురైన హౌస్ సర్జన్ తన స్వగ్రామానికి వెళ్లిపోయినట్లు సమాచారం.

బాలల సంరక్షణపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం సెంట్రల్: బాలల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి బాలల సంరక్షణ సిఫారసుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలలకు ఆశ్రయం కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ఆశ్రమాలను తరచూ తనిఖీలు చేయాలన్నారు. పౌష్టికాహారం సరఫరా, ఆరోగ్య సంరక్షణ, మంచి వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలోని బాలసదనం, చిల్డ్రన్ హోమ్ తదితర కేంద్రాల్లో పిల్లల విద్యాభ్యాసంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనుమతుల్లేని ఎన్జీఓలను గుర్తించి నివేదిక సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జోనల్ జస్టిస్ బోర్డు సభ్యుడు శ్రీనివాసులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు ఓబుళపతి, డీపీఓ ఖలీల్‌బాషా, సీడీపీఓ శ్రీదేవి, వైద్యాధికారులు విష్ణుమూర్తి, జయలక్ష్మి, ఆర్డీటీ ప్రతినిధి ఆదినారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యతతోనే ఇంజినీరింగ్‌లో రాణింపు

- ఐఐఎస్సీ ప్రొఫెసర్ శివకుమార్‌బాబు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శివకుమార్‌బాబు

బుక్కరాయసముద్రం: నైపుణ్యతతోనే ఇంజినీరింగ్‌లో రాణించగలుగుతారని విద్యార్థులకు బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్సీ) ప్రొఫెసర్ శివకుమార్‌బాబు సూచించారు. బీకేఎస్ మండలం రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్)లో సివిల్ ఇంజినీరింగ్ విభాగం వాల్ డిటెక్టరీ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ద్విబాషా సదస్సు జరిగింది. 60 మంది పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులతోపాటు వివిధ విద్యాసంస్థల అధ్యాపకులు హాజరై తమ పరిశోధనా పత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రిసిలియంట్ అండ్ సస్టేనబుల్ జియో టెక్నికల్ ప్రాక్టీసెస్ అంశంపై ప్రొఫెసర్ శివకుమార్‌బాబు మాట్లాడారు. సుస్థిరమైన దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల నిర్మాణంలో సివిల్ ఇంజినీర్ల బాధ్యత కీలకమన్నారు. అలాగే 'కిర్బి బిల్డింగ్ సిస్టం అండ్ స్ట్రక్చర్' అంశంపై సింగం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడారు. అల్ట్రాటెక్ సిమెంట్, ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి జైరాజ్ మాట్లాడుతూ.. ఆవిష్కరణాత్మక నిర్మాణ సామగ్రి నాణ్యత ప్రమాణాలు, పరిశ్రమలు - విద్యాసంస్థల అనుసంధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ టీవీ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



పట్టాల పక్కన పడి ఉన్న మృతదేహం

అనంతపురం సిటీ: అనంతపురం-తాటిచెర్ల రైల్వే స్టేషన్ల మధ్యలో హెచ్చెల్సీ కెనాల్ సమీపంలో శుక్రవారం ఉదయం రైలు నుంచి కింద పడి ఓ గుర్తు తెలియని ఓ వ్యక్తి(50) మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ కె.వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడు పింక్ కలర్ చొక్కాపై నీలం-తెలుపు గీతలున్న గళ్ల చొక్కా, తెలుపు రంగు కట్ బనియన్, నీలం రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. రైలు ప్రయాణిస్తుండగా అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందినట్లుగా నిర్ధారించారు. అయితే మృతుడు ఎవరైందీ తెలియరాలేదు. ఆచూకీ తెలిసిన వారు 94406 27662 కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

యువకుడి దుర్మరణం



సయ్యద్ బాషా (ఫైల్)

యాడికి: ముందు వెళుతున్న లారీని ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన షేక్ సయ్యద్ బాషా (34)కు భార్య రబియా, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. నైటీల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం సాయంత్రం రాయలచెరువుకు వెళ్లిన సయ్యద్ బాషా అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో క్రిష్టిపాడుకు ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. రాయలచెరువు దాటిన తర్వాత పెట్రోల్ బంక్ సమీపంలో గుత్తి వైపుగా వెళుతున్న లారీ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుకనే వేగంగా వస్తున్న సయ్యద్ బాషా ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నక్క దాడిలో 30 గొర్రె పిల్లల మృతి

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండలం కర్తనపర్తి గ్రామంలో శుక్రవారం గొర్రె పిల్లల మందపై నక్క దాడి చేసింది. ఘటనలో 30 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మహేంద్ర తన గొర్రెలను మోపు కోసం తోలుకెళుతూ పిల్లలను వేరు పరిచి ఇంటి సమీపంలోని దొడ్డిలో వదిలి వెళ్లినప్పుడు ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో దాదాపు రూ. 2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

వైద్య విద్య ప్రైవేటీకరణ తగదు

- విద్యార్థుల సమస్యలు పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వ కుట్రలో భాగమే వైద్య విద్య ప్రైవేటీకరణ అని, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకే పీపీపీ విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా విద్యా రంగ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన వలరాజు మాట్లాడుతూ.. 'మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో విద్యార్థుల కష్టాలు తీరుస్తాం. విద్యార్థులకు ఏ కష్టాలు కూడా ఉండవు. వారికి అండగా నేనుంటా' అని హామీ ఇచ్చిన నారా లోకేష్ ఈ రోజు రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ విద్యార్థుల సమస్యలను అటకెక్కించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదన్నారు. గత అసెంబ్లీ సాక్షిగా చేసిన రూ. 600 కోట్లు కూడా కేవలం ప్రకటనలకే పరిమితమైందని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఎన్డీఏ ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధుల పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, నగర అధ్యక్ష, కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, నాయకులు భాస్కర్, కార్తీక్, కుమార్, నాని జోసెఫ్, అక్రమ్, ఉదయ్ కిషన్ పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

వజ్రకరూరు: మండలంలో ఇటీవల చోరీలకు పాల్పడిన అంతర్ జిల్లా దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఎస్ఐ నాగస్వామి వెల్లడించారు. మండలంలోని కమలపాడులో నివాసముంటున్న మాజీ ఎంపీపీ శైలజా రాజశేఖరరెడ్డి ఇంట్లోకి ఈ నెల 14న చొరబడిన దుండగులు ఐదు కిలోల వెండి, రెండు జతల బంగారు కమ్మలు, రూ.10 వేల నగదు, అదే గ్రామంలోని దేవేంద్ర స్వామి ఇంట్లో అర కిలో వెండి, రూ.1.50 లక్షల నగదుతో పాటు శివాలయంలోని హుండీని బద్దలుగొట్టి భక్తుల కానుకలను అపహరించిన విషయం తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం కొనకొండ్ల సమీపంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ప్రకాశం జిల్లా కనిగిరి మండలం భూతంపల్లికి చెందిన నాగులూరి అంజయ్య, నాగులూరి యేసురత్నం, వైఎస్సార్ కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగుబిడికి గ్రామానికి చెందిన పడిగా హనుమంతును అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో చోరీ విషయాన్ని అంగీకరించారు. వారి నుంచి 2,362 గ్రాముల వెండి సామగ్రి, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యూరియాకు ఈ-క్రాప్ మెలిక సరికాదు



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: యూరియా పంపిణీకి ఈ-క్రాప్ నమోదుకు మెలికపెట్టడం సరికాదని కలెక్టర్ ఓ.ఆనంద్‌కు సీపీఐ నాయకులు విన్నవించారు. కలెక్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, జె.రాజారెడ్డి, ఇతర నాయకులు కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో రైతులకు 25,839 టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకూ 15,241 టన్నుల పంపిణీ జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులే చెబుతున్నారన్నారు. అయితే ఇప్పటి వరకూ 20 శాతం కూడా నమోదు కాని ఈ-క్రాప్ ఆధారంగా యూరియా పంపిణీ చేస్తామని మెలిక పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అవసరమున్న ప్రతి రైతుకూ ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా యూరియా అందజేయాలని కోరారు. అలాగే ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన విత్తనాలు అందించాలని విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేశవరెడ్డి, శ్రీరాములు, టి.నారాయణస్వామి, కార్యవర్గ సభ్యులు రమణ, రాజేష్‌గౌడ్, నాయకులు కృష్ణుడు, మంజు పాల్గొన్నారు.

లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారిగా డాక్టర్ జయలక్ష్మి



డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవిని కలసిన జయలక్ష్మి

అనంతపురం మెడికల్: జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారిగా డాక్టర్ జయలక్ష్మి నియమితులయ్యారు. రాయదుర్గం కమ్యూనిటీ ఆస్పత్రిలో చర్మ వ్యాధుల వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ జయలక్ష్మిని పదోన్నతిపై వచ్చిన ఆమె శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కింది స్థాయి సిబ్బందికి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

19 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో పేకాట ఆడుతూ 19 మంది పట్టుబడినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆ గ్రామంలో శుక్రవారం తనిఖీలు చేపట్టామన్నారు. యల్లమ్మ గుడి సమీపంలో అనంతపురానికి చెందిన 19 మంది పేకాట ఆడుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని రూ.65,140 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

చలో మెడికల్ కాలేజీకి తరలిన పార్టీ శ్రేణులు



చెన్నేకొత్తపల్లి వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చలో పెనుకొండ మెడికల్ కాలేజీ కార్యక్రమానికి మండలం నుంచి నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు,కార్యకర్తలు తరలివెళ్లారు. చెన్నేకొత్తపల్లి సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

రేపు 'అక్షర విన్యాసాలు' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: బిక్కి నాగమ్మ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోమ్ వేదికగా సంగీత కళాకారుడు, కథా రచయిత అగ్రహారం సత్యనారాయణ రచించిన 'గేయములు - పాటలు' 'అక్షర విన్యాసాలు' పుస్తకావిష్కరణ జరుగుతుంది. ఈ మేరకు నిర్వాహకులు అగ్రహారం కార్తీక్, వేణుగోపాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ స్మారక జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణతో పాటు రచయితలు, కవులు ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి



తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం ఇస్తున్న కటిక జయరాం

రాప్తాడు: ఆర్డీటీని పరిరక్షించాలని భీమ్ రావ్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కటిక జయరాం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలనే డిమాండ్‌తో భీమ్ రావ్ యువజన సంఘం నాయకులు ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో భీమ్ రావ్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి నాగప్ప, ఉపాధ్యక్షుడు బాల నాగేంద్ర, ఓబులేస్, ముత్యాలు, రమేష్, ఉమామహేశ్వర తదితరులు పాల్గొన్నారు.


శరన్నవరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: నగరంలోని హెచ్చెల్సీ కాలనీ నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో ఈనెల 22 నుంచి సాగే దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల పోస్టర్లను శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. మాజీ కార్పొరేటర్ బిందు ప్రియ, ఉమాదేవి, పద్మావతి తదితరులు మాట్లాడుతూ నిత్యం అమ్మవారు ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిస్తారన్నారు.

స్త్రీ ఆరోగ్యం.. కుటుంబ సౌభాగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి

రాప్తాడురూరల్: స్త్రీ ఆరోగ్యం బాగుంటేనే ఆ కుటుంబం సౌభాగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం రూరల్ 5వ సెక్టార్ పరిధిలోని పాపంపేట సచివాలయంలో రాష్ట్రీయ 8వ పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు గురించి వివరిస్తూ నమూనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు ప్రభావతి, శంకరమ్మ, సరస్వతి, లలిత, శకుంతల పాల్గొన్నారు.

ఆత్మకూరు: సంపూర్ణ పోషణతోనే ఆరోగ్యానికి రక్షణ అని సీడీపీఓ ఉమామహేశ్వరి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పోషణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు, చిన్నారులకు సమతుల ఆహారం ఇవ్వాలని తెలిపారు. రక్తహీనత నివారణ, ఊబకాయం నియంత్రణపై వైద్యనిపుణుల సలహాలు తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీవాణి, లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గాడితప్పిన ఆర్టీసీ



- ఆర్టీసీలో ఆర్‌ఎం స్థాయి నుంచి డ్రైవరు దాకా విధివిధానాలు కరువు
- డ్యూటీచార్ట్‌లను పట్టించుకోని వైనం
- ఒకరు చేయాల్సిన పనికి ఇద్దరిని పంపుతున్న అధికారులు
- బస్టాండుకు ఇద్దరు స్టేషన్ మేనేజర్లు.. విధుల్లో ఒక్కరే

అనంతపురం క్రైం: ఆర్టీసీలో ఎవరి స్థాయిలో వారు దోచుకోవడమే ధ్యేయంగా పని చేస్తున్నారు. ఇక్కడ అవినీతి ఆరోపణలపై చర్యలుండవు. విధి విధానాలకు అసలు తావేలేదు. నిబంధనలను తుంగలో తొక్కినా అడిగే నాథుడు లేడు. గతంలో లాగా కార్మిక సంఘాల పోరాటాలు లేవు. నోరు మెదిపితే అధికారులు చర్యలకు శ్రీకారం చుడుతున్నారు. ప్రశ్నించే గొంతుకలు మూగబోవడంతో ఆర్టీసీ వ్యవస్థ గాడి తప్పుతోంది.

ఎవరికి అనుకూలంగా వారు...

ఆర్టీసీ సిబ్బంది డ్యూటీ చార్టులు ఫాలో కావడం లేదు. అధికారుల స్థాయి నుంచి ఆర్టీసీ బస్సు డ్రైవరు దాకా అందరికీ ఒకే పాలసీ ఇక్కడ ఉండదు. ఎవరికి అనుకూలమైన మార్గాలను వారు అనుసరిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండుకు ఇద్దరు స్టేషన్ మేనేజర్లు ఉండాలి. ఒకరినే వేధింపుకతింటున్నారు. ట్రాఫిక్ కంట్రోల్లో ఉండాల్సిన వారికి కూడా బాధ్యతలు ఇవ్వలేదు. ఆఖరికి ఆర్టీసీ లాంగ్ ట్రిప్‌కు వెళ్లే డ్రైవర్ల విషయంలో కూడా ఈ నిబంధన పాటించడం లేదు.

సీనియర్లను కాదని...

ఆర్టీసీ ఆర్‌ఎంది కూడా అదే రూటని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. డిప్యూటీ సీటీఎంగా విధులు నిర్వహిస్తున్న శ్రీలక్ష్మికి ఆర్‌ఎంగా బాధ్యతలు అప్పగించేందుకు కావాల్సిన సీనియార్టీ లేదని కార్మికులు చెబుతున్నారు. ఆమెకన్నా సీనియార్టీ ఉన్న అధికారులున్నప్పటికీ ఆమెకే ఈ బాధ్యతలు అప్పగించారని చెబుతున్నారు. ప్రస్తుతం డిప్యూటీ సీఎంఈ రమేష్‌బాబు అదే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించే అన్ని అర్హతలున్నాయి. ఈ బాధ్యతలు ఇవ్వాల్సి వస్తే ఆయనకు ఇవ్వొచ్చని, కానీ అలా జరగలేదంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఆర్‌ఎం మధుసూధన కూడా బదిలీల జాబితాలో ఉన్నారు. ఇద్దరు అధికారులు బరిలో ఉన్నా వారిని కాదని ఆర్‌ఎంగా డిప్యూటీ సీటీఎంకి బాధ్యతలు అప్పగించడం వెనక ఆంతర్యమేమిటని కార్మిక సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల విషయంలోనే ఇన్ని లోపాలున్నాయంటే.. కిందిస్థాయిలో ఆర్టీసీ సంస్థ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సంస్థకు నష్టం వచ్చేలా...

అనంతపురం నుంచి బెంగళూరుకు రోజుకు 6 అద్దె బస్సులు, 8 ఆర్టీసీకి చెందిన బస్సులు వెళతాయి. ఈ బస్సులకు సంబంధించి డ్రైవరు ఒకరే డ్యూటీ చేయాలి. రాకపోకలకు సంబంధించి (పని దినాలు) డ్రైవరుకు మూడు రోజుల వేతనం కౌంట్ అవుతుంది. ఒక్కరు చేయాల్సిన పనికి ఇద్దరిని పురమాయిస్తున్నారు. దీంతో సంస్థకు నష్టం చేకూరుతోంది. ఇంతకీ ఇద్దరిని ఎందుకు పంపుతున్నారని ఆరా తీస్తే అసలు విషయాలు వెలుగు చూశాయి. ఇద్దరు వెళితే ఇద్దరికి చెరో మూడు రోజులు డ్యూటీ చేసినట్లు ఇద్దరికి వేతనాలు కౌంట్ అవుతాయి. డ్రైవర్లలో కూడా సదరు అధికారులకు అత్యంత సన్నిహితంగా ఉన్నవారికి, సదరు అధికారుల మర్యాదలు చూసుకునే వారికి ఈ అవకాశం ఇస్తున్నట్లు తెలిసింది. ఇదేతరహాలో నెల్లూరుకు రోజు వారి వెళ్లే బస్సులు కూడా నాలుగు ఉన్నాయి. వాటి పరిస్థితి ఏమిటోనన్న చర్చ కార్మికుల్లో జరుగుతోంది. కాగా ఈ వ్యవహారంలో మిగిలిన డ్రైవర్లకు అన్యాయం జరుగుతున్నా కార్మిక సంఘాల నేతలు ఎవరూ పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి.

హస్త కళాకారులను ప్రోత్సహించండి



లేపాక్షి ఎంపోరియంలో హస్తకళా ఉత్పత్తులు

అనంతపురం కల్చరల్: సనాతన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను చాటే హస్తకళాకారులను ఆదరించాలని లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య అన్నారు. దసరా పర్వదినాల సందర్భాన్ని పురస్కరించుకుని హస్తకళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా నగరంలోని లేపాక్షి ఎంపోరియంలో ఈనెల 20 నుంచి వచ్చేనెల 1 వరకూ డిస్కౌంట్ అమ్మకాలు, ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా బొమ్మలకొలువును తీర్చిదిద్దే సంప్రదాయ ఉత్పత్తులు, చేనేత వస్తువుల అమ్మకాలు ప్రదర్శన, మన సంస్కృతిని చాటే కళా ఉత్పత్తులలో ఎంపిక చేసిన వాటిపై 15 శాతం వరకూ డిస్కౌంటు ఇస్తున్నట్లు తెలిపారు. కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లెదర్ పప్పెట్స్, కలంకారి, ఎంబ్రాయిడరీ వస్తువులు, హ్యాండ్లూమ్స్ ఎంతో కళాత్మకంగా ఉంటాయన్నారు. హస్తకళా ఉత్పత్తులను ఆదరించే విధంగా డిస్కౌంట్ సేల్స్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్వీ డిగ్రీ కళాశాలలో వాణిజ్యోత్సవ్



విద్యార్థినుల ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'వాణిజ్యోత్సవ్–2025' ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి వాణిజ్యం, మేనేజ్‌మెంట్ విద్యార్థుల కోసం కంప్యూటర్ సైన్స్ ప్రాధాన్యత గురించి వివరించారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఎమ్మెస్సార్ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. స్వయం ఉపాధి ప్రారంభించి ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని ప్రతిభ చాటాలన్నారు. అనంతరం వివిధ డిగ్రీ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, బిజినెస్ క్విజ్ వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, కామర్స్ అండ్ మేనేజ్మెంట్ హెచ్ఓడీ టి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌నకు ఎంపిక



ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ అనంతపురం వీసీ సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఎన్ఎస్ఎస్ వలంటర్లను ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్ క్యాంప్ పరేడ్‌కు ఎంపిక చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ఆటస్థలంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ.. దేశ నిర్మాణంలో యువత చురకైన పాత్ర పోషించాలన్నారు. ఎత్తు, పరుగు సామర్థ్యం, కవాతు ప్రదర్శన, తదితర అంశాలన్నీ సమగ్రంగా పరిశీలించారు. జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టరేట్ ముఖ్య అధికారి ఎం. రామకృష్ణ, జేఎన్‌టీయూ అనంతపురం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ శిబిరంలో ఎంపికైన ఉత్తమ ప్రతిభావంతులు గుజరాత్‌లో జరిగే 10 రోజుల ప్రీ–రిపబ్లిక్‌డే పరేడ్ క్యాంప్‌లో పాల్గొంటారు.

సంక్షిప్త సమాచారం

ఆర్‌టీఐని నిర్లక్ష్యం చేయొద్దు

అనంతపురం అర్బన్: సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని సర్వే భూ రికార్డుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ హరికృష్ణ సూచించారు. కోరిన సమాచారాన్ని అపిలేటివ్ అధికారి నిర్దేశించి గడువులోగా దరఖాస్తుదారునికి అందించాలన్నారు. సమాచార హక్కు చట్టం అమలుపై సర్వే భూ రికార్డులశాఖ సిబ్బంది శుక్రవారం కలెక్టరేట్‌లోని సర్వే శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు హొన్నూరప్ప, ఉపాధ్యక్షుడు నబి రసూల్ మాట్లాడారు చట్టం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు.

రోడ్డుపైకి మురుగు



జీసస్‌నగర్‌లో ఎస్వీ డిగ్రీ కళాశాలకు వెళ్లే ప్రవేశ మార్గంలో రోడ్డుపైకి వచ్చిన మురుగు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాలువలు సరిగా లేకపోవడంతో రోడ్డుపైకి మురుగు వస్తోంది. దీంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని జీసస్‌నగర్‌లో ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రవేశ మార్గంలో ఉన్న కాలువ బ్లాక్ అయింది. దీంతో భారీగా మురుగు రోడ్డుపైకి వచ్చింది. దీంతో వాహనదారులు, పాదాచారులు కంపు భరించలేక ఇబ్బంది పడ్డారు.

ప్రొబేషనరీ ఎస్ఐలకు డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణ

అనంతపురం: జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న 19 మంది ప్రొబేషనరీ ఎస్ఐలకు డీటీసీ ఆవరణంలో సుశిక్షితులైన ఏఆర్ పోలీస్ సిబ్బంది డ్రోన్ ఆపరేటింగ్‌పై శుక్రవారం శిక్షణ నిచ్చారు. డ్రోన్లు ఎలా ఆపరేట్ చేయాలి, ఎలాంటి సందర్భాల్లో డ్రోన్ ఎగురవేయవచ్చో ప్రాక్టికల్‌గా చూపించారు.

రేషన్ బియ్యం ముఠా అరెస్టు

అనంతపురం: పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిసస్తూ కర్ణాటకలో పలు ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు అనంతపురం వన్‌టౌన్ సీఐ జి. వెంకటేశ్వర్లు తెలిపారు. వారిని అనంతపురం తహసీల్దార్ ఏ. హరికుమార్ ముందు బైండోవర్ చేశామన్నారు. పీడీఎస్ బియ్యాన్ని తరలించే వారిలో జయపాల్‌రెడ్డి, హరికృష్ణ, సుబ్రమణ్యం, రాజశేఖర్, మాధవి ఉన్నారన్నారు.

22 నుంచి ఖాద్రీశుడి దసరా ఉత్సవాలు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 11 రోజుల పాటు ఉత్సవాలు సాగుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు 22వ తేదీ (సోమవారం) స్వామి వారు మత్స్యావతారంలో దర్శనమిస్తారన్నారు. 23న కూర్మావతారం, 24న నృసింహావతారం, 25న త్రివిక్రమ అవతారం, 26న రామావతారం, 27న కృష్ణావతారం, 28న పరమ పదనాభ అలంకారం, 29న సరస్వతి అలంకారం, 30వ తేదీన మోహినీ అవతారం, అక్టోబర్ 1వ తేదీన వెంకటేశ్వర స్వామి అవతారంతో లక్ష్మీ నారసింహుడు భక్తులకు దర్శన భాగ్యం కల్గిస్తారని వివరించారు. చివరిరోజైన అక్టోబర్ 2వ తేదీన విజయదశమి నాడు మధ్యాహ్నం 2 గంటలకు ఖాద్రీశుడు ఆలయం నుంచి బయలుదేరి రాయచోటి రోడ్‌లో ఉన్న దసరా మండపానికి వెళ్తారని, అక్కడ స్వామివారికి శమి పూజ, ఆస్థాన పూజ నిర్వహించిన అనంతరం అశ్వవాహనంపై గ్రామోత్సవంతో తిరిగి ఆలయానికి చేరుకుంటారని ఈఓ వెల్లడించారు.

చిన్నారులతో ముచ్చటించిన ఎస్పీ



చిన్నారితో ముచ్చటిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం కలియదిరిగారు. పోలీస్ రక్షక్ స్కూల్‌ను సందర్శించి అక్కడ చిన్నారులతో ముచ్చటించారు. చిన్నారులకు స్కూలులో కల్పించిన వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. పోలీస్ రక్షక్ స్కూలు కోసం నూతనంగా నిర్మించిన భవన సముదాయాన్ని , నిర్మాణ దశలో ఉన్న కమాండ్ కంట్రోల్ గదుల పనులను పర్యవేక్షించారు. అనంతరం జిల్లా పోలీసు ఆయుధగారాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. పోలీస్ క్యాంటీన్‌కు వెళ్లి విక్రయాలు, నిర్వహణపై తనిఖీ చేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఎస్పీ సీఐ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి' ఇంట్లో తేనీటి విందు



జక్కంపూడి రాజాను సన్మానిస్తున్న పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాసులు

అనంతపురం కార్పొరేషన్: జిల్లాకు విచ్చేసిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు పార్టీ పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాసులు వారింట్లో శుక్రవారం తేనీటి విందునిచ్చారు. జక్కంపూడిని మహాలక్ష్మి శ్రీనివాస్ పూలమాల, శాలువాతో సన్మానించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, జెడ్పీచైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక విద్య' ప్రతినిధులకు శిక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రత్యేక విద్య చేసిన ప్రతినిధులకు నిరంతర పునరావాస విద్య (సీఆర్ఈ)లో భాగంగా 'పిల్లల అభివృద్ధి, సంరక్షణ చర్య' అనే అంశంపై విశ్వభారతి కళానికేతన్, ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. స్థానిక శ్రీనివాసనగర్‌లోని బాలాజీ కళ్యాణ మంటపంలో ప్రారంభమైన శిక్షణను తొలిరోజు సొసైటీ కోఆర్డినేటర్ కొండా లోకేష్‌రావు ప్రారంభించారు. ఈనెల 21 వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. హాజరైన అభ్యర్థులకు ఆర్సీఐ సర్టిఫికేట్ మంజూరు చేస్తుందన్నారు. రీసోర్స్ పర్సన్లుగా అహ్మద్ అలీ, పవన్ కుమార్, కొండా ప్రతాప్ వ్యవహరించారు.

నేడు సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు 102వ జయంతి వేడుకలను ఆదివారం స్థానిక కృష్ణకళామందిరంలో నిర్వహిస్తున్నట్లు అనంత్ నాగ్‌సంగీత్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధి నాగిన్ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5.40 గంటలకు సంగీత విభావరి ప్రారంభమవుతుందన్నారు.

జిల్లా పోలీసు శాఖకు నూతన జాగిలం



నూతన జాగిలం 'టైగర్'

అనంతపురం: జిల్లా పోలీసు శాఖలో నూతన జాగిలం 'టైగర్' చేరింది. మంగళగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి జిల్లాకు కేటాయించిన బెల్జియం మలనాయిస్ జాతికి చెందిన జాగిలం శుక్రవారం విధుల్లోకి చేరింది. మంగళగిరి హెడ్‌క్వార్టర్స్‌లో 10 నెలల పాటు అందించిన శిక్షణలో నేర పరిశోధన, నేరస్తులను గుర్తించడం, గంజాయి, తదితర మత్తు పదార్థాలను పసిగట్టడంలో ప్రత్యేకతను చాటుకుందని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీలో వైద్యులు, తదితర సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన పేర్కొన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యంకు ఆమె వినతిపత్రం అందించారు. బాత్‌రూంలు, రెస్ట్ రూంలు లేకుండా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రామప్పనాయక్

అనంతపురం టవర్‌క్లాక్: జై భీమ్ రావ్ భారత్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా రామప్ప నాయక్‌ను నియమించినట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడా శ్రావణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారని రామప్పనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ తనమీద ఉన్న నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని, పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తామన్నారు.

'టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తున్నారు'

అనంతపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ నేత సత్యనారాయణరెడ్డికి చెందిన భవనాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అండదండలతో సాయినగర్‌లోని పాత పావని ఆస్పత్రి భవనాన్ని తన భాగస్వాములు ఆక్రమించారని సత్యనారాయణరెడ్డి శుక్రవారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇవ్వాల్సిన రూ.7 కోట్లు ఇవ్వలేదని, ప్రైవేట్ ఆస్పత్రిలో వాటా సైతం ఇవ్వలేదని వాపోయారు. తనను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. పాత పావని ఆస్పత్రిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి డాక్టర్లు అని చెప్పుకుంటున్న జే.శ్రీనివాసరావు, ఏ. రాఘవేంద్ర, బి.శ్రీలతపై టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

రాష్ట్రస్థాయి నృత్య పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని వికాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి నృత్య పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారిని శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. కరస్పాండెంట్ జలీల్ మాట్లాడుతూ ఇటీవల నగరంలో జిల్లాస్థాయి నృత్య పోటీలు జరిగాయన్నారు. వెస్ట్రన్, జానపదాల విభాగాల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. సుహాన, మనస్వి, చిన్మయి, శశిధర్ బృందాలు, సోలో విభాగంలో షణ్ముఖ ప్రియ, హేమల్‌సాయి, కార్తీక, అబ్దుల్ రిహాన్, అశ్వన్ అలీఖాన్, ప్రియాంక, సంహిత రెడ్డి రాష్ట్రపోటీలకు ఎంపికయ్యారన్నారు. కరస్పాండెంట్‌తో పాటు హెచ్‌ఎం అనంతయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత శనివారం విడుదల చేశారు. డిగ్రీ రెండో సెమిస్టర్‌లో మొత్తం 7,760 మంది రాయగా, 3,535 (45.55 శాతం) మంది ఉత్తీర్ణత చెందారు. డిగ్రీ నాలుగో సెమిస్టర్‌లో మొత్తం 7798 మంది రాయగా, 4,250 (54.50 శాతం) మంది పాస్ అయ్యారు. ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయి. రీ వాల్యుయేషన్, పర్సనల్ ఐడెంటిఫికేషన్‌కు సంబంధించి ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించి అక్టోబర్ 6లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

బాధ్యతలు స్వీకరించిన పశుశాఖ జేడీ



జేడీ డాక్టర్ పి.ప్రేమ్‌చంద్‌ను స్వాగతిస్తున్న డాక్టర్ సుధాకర్, ఉద్యోగులు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా (జేడీ)గా డాక్టర్ పి.ప్రేమ్‌చంద్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న జేడీ డాక్టర్ టీవీ సుధాకర్ డైరెక్టరేట్‌కు బదిలీ కాగా, అక్కడి నుంచి ప్రేమ్‌చంద్‌ను ఇక్కడికి పదోన్నతిపై బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ క్రమంలో స్థానిక పశుశాఖ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్న నూతన జేడీకి ఏడీలు ఏవీ రత్నకుమార్, రామచంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం, కేఎల్ శ్రీలక్ష్మి, వీఏఎస్‌లు గోల్డ్‌మన్, నాయుడు, గోవిందరాజులు, జిల్లా మేనేజర్ మంజుల, ఇతర ఉద్యోగులు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బదిలీపై వెళుతున్న పాత జేడీ డాక్టర్ టీవీ సుధాకర్‌కు చిరుసత్కారం చేశారు.

వృద్ధుడి బలవన్మరణం

అనంతపురం సిటీ: జిల్లా కేంద్రం సమీపంలో గూడ్స్ రైలు కింద పడి శుక్రవారం ఓ వృద్ధుడు(60) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కె.విజయకుమార్ తెలిపారు.తెలుపు రంగు చొక్కా కాలర్‌పై అల్లాబక్ష్ టైలర్, కళ్యాణదుర్గం రోడ్డు, అనంతపురం అనే లేబుల్ ఉందని వివరించారు. ప్యాంట్ జేబులో ప్రభుత్వ సర్వజనాస్పత్రి ప్రిస్కిప్షన్ దొరికిందని, అందులో వెంకటప్ప(68) అని రాసి ఉందని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు 79895 84613 కు సమాచారం అందించాలని కోరారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ సంక్షేమం

ఆత్మకూరు: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని డాక్టర్ భార్గవి, ఆత్మకూరు సర్పంచ్ ఎగ్గిడి వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.